టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

గరుగుబిల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ.. శుక్రవారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 17 నుంచి 31 వరకు టెన్త్ పరీక్షలకు హాజరయ్యేవారు హాల్ టిక్కెట్‌ను చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతించాలని సూచించారు. పల్లె వెలుగు, అల్ట్రా, తదితర బస్సుల్లో ఎక్కించుకోవాలని తెలిపారు. కాగా దీనిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని డీఈవో ఎస్.తిరుపతినాయుడు తెలిపారు. ఈ విషయాన్ని టెన్త్ విద్యార్థులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించామన్నారు.

ధర లేదు.. కొనేవారు లేరు



- ఇళ్ల ముంగిటే కొండచీపుర్లు
- గగ్గోలు పెడుతున్న గిరిజన రైతులు
- విక్రయాలకు అవస్థలు
- చొరవచూపని జీసీసీ, ఐటీడీఏ అధికారులు



మూలగూడలో ఆరుబయట చీపుర్లు ఉంచిన దృశ్యం

భామిని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'అటవీ ఉత్పత్తులు, గిరిజనుల పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తాం.' అని చెబుతున్న అధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నారు. చొరవ చూపాల్సిన వారు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పట్టించుకోవడం లేదు. ఫలితంగా గిరిపుత్రులకు అవస్థలు తప్పడం లేదు. వాస్తవంగా భామిని ఏజెన్సీలో ఈ ఏడాది కొండ చీపుర్ల దిగుబడులు బాగానే వచ్చాయి. దీంతో గిరిజనులు ఎంతో సంతోషించారు. అయితే వాటి కొనుగోలుకు మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ ఏడాది కనీస మద్దతు ధర కూడా పొందలేక పోవడంతో గిరిజన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జీసీసీ, ఐటీడీఏ అధికారులు స్పందించి మార్కెట్ సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.



ఇంటి శ్లాబ్‌పైన చీపుర్లను భద్రపరిచిన గిరిజనులు

ఇదీ పరిస్థితి..

- తివ్వకొండ ప్రాంతంలో పండే చీపుర్లకు ఏళ్ల నుంచి మంచి డిమాండ్ ఉంది. అందుకే ఏటా సంతల్లో జీసీసీ వాటిని కొనుగోలు చేసేది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాజమండ్రికి చెందిన వ్యాపారులు, దళారులు కూడా ఈ గిరిజన గ్రామాల్లోనే వాటిని కొనుగోలు చేసేవారు. దీనిని గమనించిన పలు స్వచ్ఛంద సంస్థలు గిరిజనులకు ప్రత్యేక విత్తనాలు ఇచ్చి.. సాగుకు ఊత మిచ్చారు. ఈ మేరకు కొండలపై గిరిపుత్రులు చీపుర్ల సాగు విస్తీర్ణాన్ని పెంచారు. ప్రస్తుతం మండలంలోని మూలగూడ, బూర్జ గూడ, బండ్రసింగి, కడంబసింగి, నడిమి గూడ, డేకురగూడ, పాలీష్‌కోట తదితర గిరిజన గ్రామాల్లోని కొండపోడులో విస్తృతంగా చీపుర్లు సాగు చేపడు తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ఆశించిన స్థాయిలోనే దిగుబడులు వచ్చాయి. అయితే కొండచీపుర్లకు మార్కెట్ లేకపోవడంతో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. వాటిని కొనుగోలు చేసేవారే లేక.. ఎక్కడ భద్రపరుచుకోవాలో తెలియక ఆందోళన చెందు తున్నారు.
- గత ఏడాది రాజమండ్రి నుంచి వచ్చిన దళారులు కిలో చీపుర్లను రూ.60 నుంచి రూ.70కు కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది కనీస మద్దతు ధర రూ.60 వస్తుందని

(మిగతా 8వ పేజీలో...)

ఆలనలోనూ... పాలనలోనూ!



- అటు ఉద్యోగం.. ఇటు కుటుంబ బాధ్యతల్లో ఆదర్శం

6లో

కనులపండువగా పోలిపల్లి పైడితల్లి నేత్రోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన వంశపారంపర్య ధర్మకర్తలు
- ఆలయానికి పోటెత్తిన భక్తులు



6లో

వైభవంగా జామి ఎల్లారమ్మ జాతర

- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



6లో

సారాపై ఉక్కుపాదం



- 'నవోదయం' పునరుద్ధరణ
- పాత నేరస్థుల బైండోవర్
- బాధిత గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

విజయనగరం, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సారా రవాణా, తయారీపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. దీనికోసం గత టీడీపీ ప్రభుత్వం 2016లో అమలు చేసిన నవోదయం కార్యక్రమాన్ని పునరుద్ధరించారు. నవోదయం 2.0 పేరిట ఎక్కడికక్కడే సారా తయారీ, రవాణాను అడ్డుకుంటున్నారు. ఇప్పటికే 625 మంది పాత నేరస్థులను బైండోవర్ చేశారు. సారా బాధిత గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

మూడు విభాగాలుగా..

నవోదయం 2.0 కార్యక్రమాన్ని మూడు విభాగాలుగా విభజించారు. వాటిలో ఒక్కో గ్రామాన్ని ఎక్సైజ్ అధికారులు దత్తత తీసుకోనున్నారు. పాత కేసుల్లో ముద్దాయిల నేర చరిత్ర, ఆ గ్రామ స్వరూపం తెలుసు కుంటారు. గ్రామపెద్దలు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. వీఆర్వో, వీఆర్ఏ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తారు. నేర చరిత్ర ఉన్నవారిని పిలిచి ఆసక్తి ఉన్నరంగాల్లో శిక్షణ ఇస్తారు. కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో వారికి ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేస్తారు. మరోవైపు సారా తయారీకి సంబంధించి వినియోగించే బెల్లం అమ్మకాలపై దృష్టి పెడ తారు. ఇప్పటికే 46 మందికి నోటీసులు కూడా ఇచ్చారు. నవోదయం 2.0 కార్యక్రమానికి సంబం.దించి 14405 టోల్‌ఫ్రీ నెంబరును కూడా అందు బాటులోకి తీసుకుని వచ్చారు.



పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో సారా క్యాన్లతో పాటు బైకును స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది (ఫైల్)



వీరఘట్టం: గోర సమీపంలో బెల్లం ఊటలు స్వాధీనం చేసుకున్న దృశ్యం (ఫైల్)

వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరికలు..

జిల్లాలో సారా రక్కసి కోరలు చాస్తోందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఆస్పత్రులకు వచ్చే 100 మంది బాధితుల్లో పది మందికిపైగా సారా బాధితులే ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా 30 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన్నవారు బాధితులుగా మారుతున్నారు. గొంతు నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఏమి తినబుద్ధి కాకపోవడం, మూత్రం సరిగ్గా రాకపోవడం వంటి వాటితో బాధపడుతున్నారు. కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలతో బాధపడు తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ నివేదికలను పరిగణలోకి తీసుకొని ఏ ప్రాంతంలో అమ్మకాలు జరుగుతున్నాయో నిర్ధారించారు. అటువంటి ప్రాంతా లపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు.

సారాను అరికడతాం

ఉమ్మడి జిల్లాలో పాత సారా కేసులను పరిశీలిస్తున్నాం. ఇప్పటికే 625 మందికి బైండోవర్ చేయించాం. మందుబాబులకు మానసిక పునరవాస శిబిరాలు ఏర్పాటు చేశాం. అక్కడే మూడు వారాలు ఉంచి కౌన్సెలింగ్ ఇస్తాం. పాఠశాలల్లో బాలలతో క్లబ్‌లు ఏర్పాటు చేస్తాం. అక్కడే సారా తాగడం వల్ల తల్లిదండ్రులకు కలిగే అనర్థాలను వివరిస్తాం. జిల్లాలో 186 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా 85 మంది మాత్రమే ఉన్నారు. ఉన్నవారితోనే సమర్థంగా పని చేసి సారాను అరికడతాం. ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని సారా అమ్మేవారికి పునరావాసం, ఏదైన పని కల్పించేటట్లు చేస్తాం. గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించి సారా అమ్మ కుండా, తాగకుండా చర్యలు చేపడతాం.

-బాబ్జీరావు, డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ

కొండపల్లి వర్సెస్ బొత్స

- మద్యం అమ్మకాలపై వాగ్వాదం
- శాసనమండలి వేదికగా చర్చ

విజయనగరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలి వేదికగా శుక్రవారం జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం అమ్మకాలపై జరిగిన చర్చలో ఇద్దరు నేతలూ విమర్శలు చేసుకున్నారు. శాసన మండలిలో ప్రతిపక్షనేతగా ఉన్న బొత్స రాష్ట్రంలో మద్యం విధానాన్ని విమ ర్శిస్తూ చర్చ సాగించారు. ముందుగా ఆయన మాట్లాడుతూ.. 'విజయ నగరం జిల్లా నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామంలో ఓ బెల్టుషాపు నిర్వాహకుడి వద్ద రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకూ మద్యం దొరుకుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్ ఉన్న వైన్ షాపుల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే మద్యం విక్రయాలు జరగాలి. కానీ, విజయనగరం జిల్లాలో ఇందుకు విరుద్ధంగా మద్యం విక్ర యాలు సాగుతున్నాయి.' అని సభలో కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బొత్స వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. 2004 నుంచి 2014 వరకూ జిల్లాలో మద్యం వ్యాపారాన్ని నడిపించిందే కాక, కింగ్‌గా ఎవరు వ్యవహరించారన్న విషయాన్ని ప్రతిపక్ష నేత బొత్స మరిచిపోయారా? అంటూ కౌంటర్ ఇచ్చారు. దీనికి ప్రతిపక్షం వైసీపీ నుంచి మౌనం కనిపించగా, అధికార పక్షం నుంచి ప్రశంసలు లభించాయి. ప్రతిపక్ష నేత చెప్పినట్టు విజయనగరం జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మకాలు జరగడం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పారదర్శకంగా విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. అవసరమైతే నేరుగా తానే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని సభలో చెప్పారు. మద్యం అక్రమ విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.





పాలకొండ ఇన్‌చార్జి కమిషనర్‌గా జయరాం

పాలకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ టి.జయరాంను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తానని, నగర పంచాయతీలో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి కేంద్రీకరిస్తానని చెప్పారు. కాగా గతంలో ఇక్కడ పని చేసిన కమిషనర్ ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో మేనేజర్ జయ రాంకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్ చార్జి కమిషనర్‌కు కౌన్సిలర్లు, ప్రజా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలను గౌరవించాలి: కలెక్టర్

బెలగాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నిరంతరం శ్రమిస్తూ.. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు 2కే రన్ నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత విద్యార్థులు, అధికారులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. నేటి సమాజంలో మహిళలు స్వశక్తితో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయ, క్రీడా రం గాల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐసీడీఎస్ పీవో కనకదుర్గ, డీఈవో తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సకాలంలో నీటి తీరువా చెల్లించాలి

జియ్యమ్మవలస: ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చే నిధులే కాకుండా రైతులు కచ్చి తంగా భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు అభివృద్ధికి అవసర మయ్యే నీటి తీరువాను రైతులు చెల్లించేలా చైతన్యపర్చాలని సూచించారు. అనంతరం ఆర్ఆర్‌బీ పురం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గిరిజన క్రీడా పాఠశాల ఏర్పాటు విషయాన్ని గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కలెక్టర్ దృష్టికి తేగా... వెంటనే ఆయన ఆ మైదానానికి వెళ్లి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ పక్కనే ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు 'సుందర కాండ' పాఠ్యాంశంపై పలు ప్రశ్నలు వేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా టెన్త్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే ఇన్విజిలేటర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసెంబ్లీ దృష్టికి పార్వతీపురం సమస్యలు

- ప్రస్తావించిన ఎమ్మెల్యే విజయచంద్ర

8లో

మిర్తివలసలో అగ్నిప్రమాదం

- 1,839 టేకు, జీడిమామిడి చెట్లు దగ్ధం



8లో

ఆలనలోనూ.. పాలనలోనూ!

ఆకాశంలో సగం వారు. అవకాశాలను అందిపుచ్చుకొని... రాణించడంలోనూ మేటి వారు. నేలపైనా... నింగిలోనూ మెరవడం వారికి మాత్రమే సాధ్యం. వారే మన జీవితాల్లో సగమై... మునుముందుకు నడిపిస్తున్న మహిళామణులు. శనివారం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల గురించి తెలుసుకుందాం.

ధైర్యం సొంతమైతే... ప్రపంచం మన చేతిలోనే..

● డీఎస్పీ భవ్యారెడ్డి

● అటు ఉద్యోగం.. ఇటు కుటుంబ బాధ్యతల్లో ఆదర్శం

● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



బొబ్బిలి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ధైర్యంగా ముందుకెళితే... ప్రపంచాన్ని సునాయాసంగా మూటగట్టుకోవచ్చునని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు, యువతులకు, చిన్నారులకు స్ఫూర్తిని రగిలించే అంశాలపై ఆమె మాట్లాడారు. 'పుట్టపర్తి శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేశా. సత్యసాయి బోధనలు, సేవా స్ఫూర్తిని అందిపుచ్చుకున్నా. ఇండోర్‌లో టెలికమ్ ఇంజనీరుగా... ఆ తరువాత రైల్వేశాఖలో ఆపరేషన్ విభాగంలో పనిచేసి 2022లో గ్రూపు-1 పరీక్షలు రాసి పోలీసు శాఖలో చేరా. పోలీసు శిక్షణలో 9 వ ర్యాంకు సాధించా. సవాళ్లు ఉండాలనే సంకల్పంతోనే పోలీసు శాఖలో చేరాను. బొబ్బిలి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించి నెలరోజులవుతోంది. చరిత్రాత్మకమైన బొబ్బిలి ప్రాంతంలో నా తొలి పోలీసు ఉద్యోగంలో చేరడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతి రోజూ కొత్త విషయాలను నేర్చుకోగలుతున్నాను. ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు చాలా సౌమ్యంగా, వినమ్రంగా ఉండడం నన్ను బాగా ఆకర్షించింది. విధి నిర్వహణలో మంచి సిబ్బంది సహకారం, టెక్నాలజీ బాగా ఉపయోగపడుతున్నాయి.

కుటుంబ నేపథ్యం...

- **తండ్రి:** వెంకటరామిరెడ్డి, రాయచోటి ఎంపీపీఈ స్కూలు హెచ్ఎం
- **తల్లి:** చంద్రకళ, ఆరోగ్యశాఖ ఉద్యోగిని
- **చెల్లెలు:** ప్రవల్లిక, హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయవాది
- **తమ్ముడు:** త్రివిక్రమరెడ్డి, ఎంబీబీఎస్
- **భర్త:** కేతిరెడ్డి సాయిసందీప్, బెంగళూరులో ఆటోమొబైల్ ఇంజనీరు
- **కుమారుడు:** చరణ్ తేజ (5సంవత్సరాలు)



డీఎస్పీగా విధి నిర్వహణలో...

ఏబీసీ అవసరం..

బాలికలు, మహిళలు రాణించేందుకు.. నిత్యం అప్రమత్తంగా ఉండేందుకు తరచుగా ఏబీసీ (ఆల్ వేజ్ బీకేర్‌ఫుల్) అవసరమని చెబుతుంటా. విద్యా సంస్థలకు వెళ్లి... విద్యార్థులకు ప్రేరణ కలిగించే అంశాలు బోధించడం నా హాబీ. డీఎస్పీగా అందరికీ సహకరించాలన్న ధ్యాస మెండుగా ఉంది. డోర్ డెలివరీ సర్వీసెస్ అందించేందుకు చర్యలు తీసుకుంటాను. ప్రతీ పోలీసు స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్ డెస్క్ ఉంది. ఈ సేవలను బాధిత మహిళలంతా వినియోగించుకోవచ్చు.

కష్టపడి ఉన్నత స్థాయికి...



బెలగాం, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి... ఉద్యోగం సంపాదించి.. వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి.. ప్రస్తుతం ఐసీడీఎస్ పీవోగా విధులు నిర్వహిస్తున్నా. మహిళలంతా ఏకాగ్రతతో కష్టపడితే లక్ష్యసాధనన కష్టమేం కాదు. మా తల్లిదండ్రులు విజయవాడలో నివశించేవారు. తల్లి ఉపాధ్యాయురాలు. తండ్రి ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేస్తుండేవారు. వారికి మేం ఐదుగురం సంతానం. ఇద్దరు ఆడపిల్లలు... ముగ్గురు మగ పిల్లలు. నా భర్త ఏఎస్ చక్రవర్తి గుంటూరు ఏఎస్పీగా పని చేస్తున్నారు. నేను ఒకటి నుంచి పదో తరగతి వరకు విజయవాడలో విద్యను అభ్యసించాను. ఇంటర్ మీడియట్ ఖమ్మంలోని ఎస్ఆర్ఎన్ బీజేఎన్ఆర్ కళాశాలలో పూర్తి చేశాను. పీజీ తిరుపతిలోనూ, పీహెచ్‌డీ నేషనల్ పోలీస్ అకాడమీ (ఉస్మానియా యూనివర్సిటీ)లో పూర్తి చేశాను. 1993లో ఏపీపీఎస్‌లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. అనంతరం వెలుగు ఏపీడీగా విశాఖపట్నంలో, వివిధ హోదాల్లో విజయనగరం, విశాఖపట్నంలో పని చేశాను. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో ఐసీడీఎస్ పీవో (ప్రాజెక్టు ఆఫీసర్)గా విధులు నిర్వహిస్తున్నాను.

-తోట కనకదుర్గ, ఐసీడీఎస్ పీవో, పార్వతీపురం

మూడు ముళ్లు పడినా లక్ష్యం సాధించడం సులువే..

● బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి



అధికారులతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

కుటుంబ నేపథ్యం...

- **తండ్రి:** లాలం జగ్గునాయుడు ● **తల్లి:** సత్యవతి
- **స్వగ్రామం:** తిరువోలు, చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా
- **విద్యాభ్యాసం:** ప్రాథమిక విద్య స్వగ్రామంలో, సెకండరీ, ఉన్నత పాఠశాల విద్య భీమిలి ప్రభుత్వ గురుకుల పాఠశాల.
- **భర్త:** చొక్కాకుల కన్నంనాయుడు, ఆర్మీలో సిగ్నల్ విభాగంలో నాయక్
- **సంతానం:** యోచన్‌నాయుడు (7), యశస్విని (3)

బొబ్బిలి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'నిరక్షరాస్యుడైన నా తండ్రికి శారీరక కష్టం చేయడంతో కాళ్లు, చేతులు రెండూ పూర్తిగా బండబారిపోయాయి. హాస్టల్‌లో ఉంటూ చదువుకునే నేను సెలవుల్లో ఇంటికొచ్చినప్పుడు నాన్నకు వ్యవసాయంలో సాయం చేసేదానిని. 'నాలాగా కష్టపడే బతుకు నీకొద్దు... దర్జాగా ఓ మంచి అధికారిగా ఎదగాలమ్మా...' అని తరచూ నాన్న అంటుండే మాటలనే స్ఫూర్తిగా తీసుకొని గ్రూపు-2 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచి.. మున్సిపల్ కమీషనరుగా ఉద్యోగాన్ని సాధించగలిగాను. 2018లో గ్రూపు -2 లో ఎంపికై మొదటిసారిగా ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్గా బాధ్యతలు చేపట్టాను. 19 ఏళ్ల వయస్సులోనే నాకు వివాహమైంది.

● పెళ్లయి, పిల్లలు పుట్టిన తరువాత కూడా కెరీర్ సాగించవచ్చని నిరూపించుకోగలిగాను. ఇందుకు నాన్న ప్రతిసారి చెప్పే మాట నాకు స్ఫూర్తి. ఇటు కుటుంబాన్ని, అటు అధికారిక బాధ్యతలను బ్యాలెన్స్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నా పిల్లలకు తల్లిగా, నా తల్లిదండ్రులకు ఏకైక బిడ్డగా ఆలనాపాలనా చూస్తూనే.... కమిషనరుగా పాలన సాగిస్తున్నాను. పెళ్ల యినా ఆడబిడ్డ అనుకుంటే ఏదైనా సాధించ గలదు. భర్త, కుటుంబ సభ్యుల సహకారంతో ఇది సాధ్యమైంది.

● ప్రతి మహిళ ఆత్మస్థైర్యం, వ్యక్తిగత స్వేచ్ఛను కలిగి ఉండాలి. వ్యక్తిగతంగా మనో, ధైర్యంతో ముందుకు సాగాలి. ఆత్మన్యూనతను దరిదాపులకు రానీయకూడదు. మహిళలు అన్నిరంగాలలో ఉన్నతిని సాధించడానికి చుట్టూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

-లాలం రామలక్ష్మి



బిడ్డను స్కూలుకు సిద్ధం చేస్తూ..

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి..



మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. పిల్లల చదువుల పట్ల మహిళలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. మహిళల కోసం రాష్ట్రంలో డ్వా క్రా గ్రూప్‌లను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుంది. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకు శుభాకాంక్షలు.

-గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

ఆర్థిక ప్రగతి సాధించాలి..



మహిళా దినోత్సవం సందర్భంగా మహిళందరికీ శుభాకాంక్షలు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. నేను ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించా. నేడు జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాను. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. దీనికి తగిన విధంగా కృషి చేయాలి.

-హేమలత, జిల్లా రెవెన్యూ అధికారి

కుటుంబానికి పెద్దదిక్కుగా.. పిల్లలకు ఆసరాగా!

సాలూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వారిని కోల్పోయినది ఒకరు. తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని మరొకరు. పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే తపనతో ఇంకొకరు... ఇలా విభిన్న పరిస్థితుల్లో పార్వతీపుం మన్యం జిల్లాలోని కొంతమంది మహిళలు కుటుంబ భారాన్ని మోస్తున్నారు. వారి గురించి తెలుసుకుందాం...

హోటల్‌లో పని చేస్తూ...



ఎస్ఆర్‌టీపీ రాధ కుటుంబం

ఈమె పేరు ఎస్ఆర్‌టీపీ రాధ. గ్రామం మామిడిపల్లి. భర్త చిరంజీవిరాజు కొట్టక్కి వద్ద పెట్రోల్ బంకులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అనారోగ్యంతో 2023లో మరణించాడు. పేద కుటుంబమైన రాధకు దిక్కు తోచలేదు. చిన్నపిల్లలైన సాయి కుమార్, ఝాన్సీ ఉన్నారు. వారిని పెంచడానికి ఆమె కూడా సాలూరు, మామిడిపల్లిలో గల పెట్రోల్ బంకుల్లో కొన్నాళ్లు పని చేశారు. ప్రస్తుతం సాలూరులో ఒక హోటల్‌లో పనిచేస్తున్నారు. సాయికుమార్ ఇంటర్మీడియట్, ఝాన్సీ 9వ తరగతి చదువుతున్నారు. తన పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కష్టపడుతున్నానని రాధ చెబుతున్నారు.

పిల్లలే లోకంగా...



గంగవంశం సావిత్రమ్మ

ఈమె పేరు గంగవంశం సావిత్రమ్మ. గ్రామం మామిడిపల్లి. భర్త శేషగిరిదేవ్. ఆయన మామిడిపల్లిలో ఉన్న ఏపీజీవీబీ బ్యాంక్ సిబ్బందికి సాయపడుతూ కుటుంబాన్ని పోషించుకునే వారు. అనార్యోగంతో ఆయన 2017లో మరణించారు. ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియని పరిస్థితి సావిత్రమ్మది. బ్యాంక్‌లో సిబ్బందికి సాయపడుతూ... వారిచ్చే రూ.3000 నుంచి రూ.4000తో ఇద్దరు పిల్లలను చదివిస్తూ... కుటుంబ భారం మోస్తున్నారు. ప్రస్తుతం కుమారుడు జితేంద్రదేవ్ డిగ్రీ పూర్తి చేశారు. అమ్మాయి నవ్యశ్రీ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. తనకు పిల్లల భవిష్యత్తు ముఖ్యమని... వారిని చదివించడానికే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని సావిత్రమ్మ చెబుతున్నారు.

కూరగాయల వ్యాపారంతో...



గాజుల రాములమ్మ

ఈమె పేరు గాజుల రాములమ్మ. గ్రామం మామిడిపల్లి. భర్త తాపి పనిచేసేవారు. ఆయన ఆకస్మికంగా 1999లో మరణించారు. అప్పటికి పిల్లలు శంకర రావు (5), రామకృష్ణ (4) చిన్నపిల్లలు. వారిని పెంచడానికి ఆమె రామభద్రపులో కూరగాయలు కొనుగోలు చేసి సారిక, తోణాం, నేరేళ్లవలస తదితర సంతలు, గ్రామాల్లో విక్రయించేవారు. ఆ డబ్బులతో పిల్లలను పెంచారు. ఆదాయం లేకపోవడంతో పిల్లలను వారిని చదివించలేదు. పిల్లలు పెరిగి.. పెళ్లిళ్లు కావడంతో విశాఖలో ఉపాధికి వెళ్లిపోయా రు. ఆమె మాత్రం అప్పట్లో రాజులిచ్చిన స్థలంలోనే ఇప్పటికీ ఉంటూ... అక్కడే కూరగాయల దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఎన్నో కష్టాలకోర్చి.. పిల్లలను పెంచి పెద్ద చేశానని.. ప్రస్తుతం ఉన్నదాంట్లో వాళ్లు చక్కగా బతకడం సంతృప్తినిస్తోందని తెలిపారు.

చదువుకు ప్రాధాన్యం పెరిగింది..



గ్రామాల్లో స్త్రీలు గతంలో పనులకు వెళ్లేవారు. చదువులకు ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా మహిళలకు సాయం అందుతోంది. ఉద్యోగాలు, పొదుపులు వంటివి ఇస్తున్నారు. చదువుకు ప్రాధాన్యం పెరిగింది.

-నడికట్టు కొండమ్మ (90), మామిడిపల్లి

బతుకు బండికి మరోవైపు!

విజయనగరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబమనే బండి ఆర్థికంగా ఒడిదొడుకులు లేకుండా... కొంత సాఫీగా సాగాలంటే.. భార్యాభర్తలు ఒకరికొకరు చేదోడుగా ఉంటాలంటోంది విజయనగరంలోని మండపం వీధికి చెందిన కొవ్వూరు నందిని. తోపుడు బండిపై కూరగాయలు, పండ్లు విక్రయిస్తూ భర్తకు సాయంగా ఉంటోంది. తన భర్త పెయింటర్ అని... అతని ఆదాయం అంతంతమాత్రమే కావడంతో కుటుంబ పోషణ కోసం ఇలా చిరు వ్యాపారం చేస్తున్నట్టు చెబుతోంది. తన సంపాదన పిల్లల చదువుకు కొంతమేరకు ఉపయోగపడుతోందని అంటోంది.



కనులపండువగా పోలిపల్లి పైడితల్లి నేత్రోత్సవం

● పట్టువస్త్రాలు సమర్పించిన వంశపారంపర్య ధర్మకర్తలు

రాజాం రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారి నేత్రోత్సవం, ఖడ్గపూజ శుక్రవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న అమ్మవారి 99వ వార్షిక జాతరలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సుమారు మూడు గంటల పాటు ఘనంగా నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు వాకచర్ల కుటుంబీకులు అమ్మవారి తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

● **పట్టు వస్త్రాల సమర్పణ..**

వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, వారి కుటుంబీకులు వాకచర్ల రాజా, వాకచర్ల పైడిరాజు తదితరులంతా బ్యాండుమేళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయానికి సాయంత్రం ఆరు గంటలకు చేరుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారికి దిష్టి చుక్క పెట్టి ఆలయం నుంచి వెనుదిరిగారు.

ఘటాలయానికి అమ్మవారు..

శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఓవైపు నేత్రోత్సవం జరుగుతుండగా ... కొండంపేట గ్రామానికి చెందిన ఘటాల పూజారి లంకలపల్లి సత్యనారాయణ కుటుంబీకులు కర్ర ప్రతిమలను అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. అక్కడి నుంచి ఆలయానికి ఎదురుగా ఉన్న వనంగుడి వద్దకు వెళ్లి కర్ర ప్రతిమలను ఉంచి పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ఆవాహన చేసి కొండంపేటలోని ఘటాలయానికి తీసుకువెళ్లారు. ఈనెల 11 వరకు అమ్మవారు ఘటాలయంలో ఉంటారని ప్రతీతి. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బి.వి.మాధవరావు, ఎస్.వి.ఆర్. కళా పరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పైడితల్లి అమ్మవారు

వైభవంగా జామి ఎల్లారమ్మ జాతర





అమ్మవారి రూపంతో వస్తున్న భక్తురాలు

జామి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు జామి ఎల్లారమ్మ జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శక్తివంతమైన తల్లిగా ప్రసిద్ధిగాంచిన ఎల్లారమ్మను ఆంధ్ర, తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు శుక్రవారం వేకువజాము నుంచి రాత్రి పది గంటల వరకు అమ్మవారిని లక్షకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు అంచనా. ఈ ఏడాది సీఐ అప్పలనాయుడు, ఈవో ప్రసాద్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లతో భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు అత్యంత అరుదుగా దొరికే బంగారుతీగ చెరుకు గడలు అలరించాయి. ఇదిలా ఉండగా.. అమ్మవారి ఆలయం పక్కన ఉన్న చెట్టు వద్ద భక్తులు పూజలు చేసి దీపాలు వెలిగిస్తున్నారు. అదే సమయంలో ఇద్దరు చిన్నారులు భక్తులు

● **భారీ సంఖ్యలో హాజరైన భక్తులు**

ఆలయంపైకి విసిరే పసుపు, కుంకుమ పొట్లాలు, గాజులు ఏరుకోవడం చూసిన వారి కళ్లు చెమర్చాయి.



జామి ఎల్లారమ్మ తల్లి దర్శనానికి తరలివస్తున్న భక్తులు



అభివృద్ధి పనులకు నిధులు



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

● కలెక్టర్‌తో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎంపీలాడ్స్ నిధుల విడుదలపై కలెక్టర్ అంబేడ్కర్‌తో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చర్చించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో ఆయన భేటీ అయ్యారు. ప్రతిపాదించిన పనులన్నీ వెంటనే చేపట్టేందుకు వీలుగా అవసరమైన అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా ఆదేశాలిస్తామని కలెక్టర్ చెప్పారు. అనకాపల్లి జిల్లా కె.డి.పేటలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు సమాధి వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు తన ఎంపీ నిధులు నుంచి అసెంబ్లీ స్పీకర్ కోరిన మేరకు రూ.10 లక్షలు మంజూరు చేశామన్నారు. ఆ నిధులను అనకాపల్లి జిల్లా యంత్రాంగానికి పంపించాలని ఎంపీ కలెక్టరును కోరారు. ఒందుకు అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టరు చెప్పారు.

ప్రజలకు చేరువలో జన ఔషధి కేంద్రాలు

● విజయనగరం రింగురోడ్డు: ప్రజలకు చేరువలో జన ఔషధీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. శుక్రవారం ప్రధాన పోస్టాఫీసు ఎదుట జన ఔషధీ దుకాణం వద్ద జన ఔషధి దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ బ్రాండెండ్ ఔషధాలు తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయన్నారు. జలుబు నుంచి క్యాన్సర్ వరకూ అన్ని రకాల ఔషధాలు తక్కువ ధరకు లభ్యమవుతాయన్నారు. జిల్లాలో జన ఔషధీ మందుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఎంహెచ్‌వో జీవనరాణి, ఔషధ నియంత్రణ విభాగం ఏడీ అనిత పాల్గొన్నారు.

పోలిపల్లి పైడితల్లి జాతరకు పటిష్ఠ ఏర్పాట్లు

● రెండు డ్రోన్లు, 27 సీసీ కెమెరాలు, 400 మంది పోలీసులు
● వాహనాల దారి మళ్లింపు.. 8 పార్కింగ్ స్థలాలు గుర్తింపు
● డీఎస్పీ రాఘవులు వెల్లడి



మాట్లాడుతున్న చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు

రాజాం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాజాంలో ఈనెల 9 నుంచి 11 వరకు జరగనున్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 99వ జాతరకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు అన్నారు. శుక్రవారం రాజాం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి జాతరలో రెండు డ్రోన్లు, 27 సీసీ కెమెరాలు, 400 మంది పోలీసులను వినియోగించ నున్నామన్నారు. జాతరను ఎస్పీ తన కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నారని తెలిపారు.

రాజాం కేంద్రంగా మెయిన్‌రోడ్, చీపురుపల్లి రోడ్డు, బొబ్బిలి రోడ్డుల్లో ఎనిమిది పార్కింగ్ స్థలాలను గుర్తించామన్నారు. ఆయా ప్రదేశాల్లో మాత్రమే ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు పార్క్ చేయాల్సి ఉంటుందన్నారు. జాతర ప్రాంతంలో నెలకొన్న రద్దీని అనుసరించి ఎప్పటికప్పుడు నియంత్రణ చర్యలు తీసుకుంటామన్నారు. చివరిరోజు మంగళవారం బొబ్బిలి మార్గం నుంచి రాజాం వైపు వచ్చే వాహనాలను చీకటిపేట జంక్షన్ నుంచి గ్రారాజు చీపురుపల్లి, బొద్దాం, పెనుబాక మీదుగా రాజాం, అలాగే రాజాం నుంచి బొబ్బిలి వైపు వెళ్లే వాహనాలు పెనుబాక, బొద్దాం, గ్రారాజు చీపురుపల్లి, చీకటిపేట మీదుగా మళ్లించేలా చర్యలు తీసుకున్నారమన్నారు. అమ్మవారి ఆలయం సమీపంలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటుతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాలుగు ప్రత్యేక బృందాలను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. జాతరలో కొమ్ముబుంగల అమ్మకాలు నిషేధించామన్నారు. వాటిని అమ్మిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఆకతాయిల ఆట కట్టించేందుకు సిబ్బందిని మఫ్టీలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రశాంత జాతరకు అందరూ సహకరించాలని డీఎస్పీ కోరారు. ఆయనతో పాటు సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవికిరణ్ ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

జాతీయ కబడ్డీలో సత్తా చాటిన అలుగోలు విద్యార్థి

నెల్లిమర్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో అలుగోలు విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. శుక్రవారం అలుగోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నెక్కల్ల గంగరాజు మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాడు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సూర్యారావును శుక్రవారం డీఈవో మాణిక్యం నాయుడు అభినందించారు.

అన్నా క్యాంటీన్‌కు స్థల పరిశీలన

చీపురుపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో స్థలాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పరిశీలించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, ఆరతి సాహు, సబ్బి సోనియా, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీకి సత్కారం

విజయనగరం రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిని శుక్రవారం వర్సిటీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, జిల్లా ఆడిట్ అధికారి బి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో..

నెల్లిమర్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారుపాప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళల భద్రత, సాధికారిత అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయాల్లో..

వేపాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి). మండలంలోని వేపాడ, సోంపురం, బక్కునాయుడుపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు అశోకరాజు, మోహనరాజు, ఆకుల శ్రీను, పాల్ సుధాకర్, తాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయరాళ్లకు శుభాకాంక్షలు తెలిపి చేతిసంచులు అందజేశారు.

నేడు ప్రజాదర్బార్

లక్కవరపుకోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎల్.కోటలోని నివాసంలో శనివారం ఉదయం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే లలితకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలను నేరుగా తెలియజేయవచ్చునన్నారు.

సంతకవిటి పీఎస్ తనిఖీ

సంతకవిటి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, రహదారి నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు, ఎస్‌ఐ గోపాలరావు ఉన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం



కోనేరు గట్టును చదును చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలో సర్వే నెంబరు 60లో విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు పలువురు రంగం సిద్ధం చేశారు నెల్లిమర్లలోని ఫ్లైఓవర్ పక్కన చంద్రబాబునగర్ కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ కోనేరును కప్పేసి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు కొంత మంది రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో చదును చేసే పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమి సంరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఎమ్మెల్సీ గాదెను కలిసిన 'వెలమ' ప్రతినిధులు



ఎమ్మెల్సీ గాదెతో సంఘ నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులు నాయుడును శుక్రవారం కొప్పుల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనరు గొట్టాపు చిన్నంనాయుడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని వారు కోరారు.

సారాతో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు

విజయనగరం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సారాతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని విజయనగరం సర్కిల్-2 రూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు ఎం.విజయలక్ష్మి అన్నారు. సారా నిర్మూలనకు గ్రామస్థులు సహకరించాలని ఆమె కోరారు. శుక్రవారం గంట్యాడ మండలం డీకెపర్తి పంచాయతీ పరిధిలోని అడ్డతీగ గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసిరావు, హెచ్‌ఎం రామ్మోహనరావు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణం



నిర్మాణమైన సీసీ రోడ్డు

గజపతినగరం, మార్చి 7:(ఆంధ్రజ్యోతి) మండలంలోని గజపతి నగరం రైల్వే కాలనీకి 30 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి రూ.18 లక్షలు కేటాయించింది. ఇందుకు గానూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అక్టోబరులో భూమిపూజ చేశారు. పనులు పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంపై సమీక్ష చేశారన్నారు. ఎయిర్‌పోర్టు సేవలు 2026 నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. ఎయిర్‌పోర్టు పూర్తయితే, ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి లోకేశ్ చొరవతో విశాఖపట్నానికి టీసీఎస్, గూగుల్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు కూడా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతున్నాయన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్టును విజయనగరం వరకూ పొడిగిస్తే మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లానన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి



డాక్టర్‌తో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు, పోలీసు కుటుంబాల మహిళల కోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే మిగిలిన సభ్యులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పని ఒత్తిడితో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రాథమిక స్థాయిలో సమస్యను గుర్తించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, తిరుమల మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టరు యమున, బీఎస్‌పీ శ్రీనివాసరావు, జీవిత, సీఐలు లీలారావు, నర్సింహమూర్తి, బంగారుపాప, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సారా లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

విజయనగరం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సారా లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు అన్నారు. శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సారాను సమూలంగా నివారించడమే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 163 సారా ప్రభావిత ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో ఒక్కో ఎక్సైజ్ అధికారి రెండు మూడు గ్రామాలు దత్తత తీసుకుంటారన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. సారాపై టోల్ ఫ్రీ నెంబరు 14405తో పాటు విజయనగరం కంట్రోల్ నెంబరు 08922-274865, పార్వతీపురం కంట్రోల్ రూం నెంబరు 08963-222778 ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు

విజయనగరం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామన్నారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖపరమైన సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

బైకు బోల్తా: ఒకరి మృతి

క్రైంన్యూస్

జియ్యమ్మవలస, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ పంచాయతీ నీలకంఠాపురం గ్రామానికి చెందిన కొండగొర్రి నాగేశ్వరరావు (46) మృతిపై జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ పి.అనీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నీలకంఠాపురం గ్రామానికి చెందిన నిమ్మక శంకరరావు గురువారం రాత్రి తన బైకుపై స్వగ్రామం గ్రామం నుంచి నాగేశ్వరరావు, పాలక లాలిబాబులను ఎక్కించుకుని గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దిడి గ్రామంలో గ్రామదేవత పండుగకు బయలుదేరారు. మార్గమధ్యంలో బైకు బోల్తాపడింది. ఈ ఘటనలో వెనుక కూర్చొన్న నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంపై జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శంకరరావు నిర్లక్ష్యం.. మితిమీరిన వేగమే నాగేశ్వరరావు మృతికి కారణమని మృతుడి అన్నయ్య కుమారుడు కొండగొర్రి అప్పారావు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

భోగాపురం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాంరాయవలస సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన పాండ్య జ్యోతేంద్రనారాయణ(42) గురువారం రాత్రి మృతి చెందాడని సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. పాండ్య జ్యోతేంద్రనారాయణ ప్రస్తుతం విశాఖలో నివాసం ఉంటున్నాడన్నారు. ఈనెల 5న శ్రీకాకుళం వెళ్లి ద్విచక్రవాహనంపై విశాఖ వస్తుండగా అమటాం రాయవలస సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్నాడన్నారు. తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

డ్రోన్ సాయంతో పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టూటౌన్ పరిధిలో వైఎస్సార్‌నగర్‌లో టూటౌన్ పోలీసులు డ్రోన్ కెమెరాతో పేకాట శిబిరంపై శుక్రవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారి ఆచూకీ కనిపెట్టారు. 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6570 నగదు, 9 బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో నలుగురు వ్యక్తులను డ్రోన్ సాయంతో గుర్తించి ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

గెడ్డవాగు భూమిపై రెవెన్యూ బోర్డు



వివాదస్పద స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

విజయనగరం రూరల్/ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండల పరిధిలోని జమ్మునారాయణపురం సర్వే నెంబరు 148/1 స్థలంలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో వేసిన రాళ్లను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి'లో 'గెడ్డవాగుపై గెద్దలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. రాజకీయ పార్టీల నేతల్లో గుబులు పుట్టించింది. గెడ్డవాగు భూమిని తమదంటే, తమదని రెండు వర్గాలు వివాదస్పదం చేశాయి. స్థానికులు కూడా దాన్ని వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాలతో తహసీల్దారు కూర్మనాథరావు స్పందించారు. విలువైన భూమిని కాపాడే ప్రయత్నంలో భాగంగా బోర్డును ఏర్పాటు చేశారు.

పట్టాలు ఇప్పించండి



తహసీల్దారుతో మాట్లాడుతున్న మాజీ సైనికులు

మెంటాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సాగు భూములకు పట్టాలు ఇప్పించాలని మాజీ సైనికుల ఉద్యోగులు తహసీల్దార్ శ్రీనివాసరావును కోరారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్.. గతంలో జరిగిన భూ కేటాయింపు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు.

సివిల్‌సప్లైస్ అధికారుల దాడులు

విజయనగరం కలెక్టరేట్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హోటళ్ల రెస్టారెంట్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై సివిల్‌సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డొమెస్టిక్ సిలిండర్ల వినియోగాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్రంతో పాటు డెంకాడ, గజపతినగరం మండలాల్లో 8 కేసులు నమోదు చేశారు. 25 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. రెండో బృందం చీపురుపల్లి, రాజాం, గరివిడి మండలాల్లో తనిఖీలు చేశారు.

● రాజాం/ రూరల్: రాజాంలో రెవెన్యూ శాఖ అధికారులు దాడులను విస్తృతం చేశారు. గురువారం పట్టణంలో దాడులు నిర్వహించి 12 మందిపై కేసులు నమోదు చేసి అధికారులు శుక్రవారం రాజాంలోని పలు హోటళ్ళ, బేకరీలపై ఆకస్మికంగా దాడులు చేపట్టారు. కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు గుర్తించారు. 16 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్ డీటీ చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరుబాట

నెల్లిమర్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు సీపీఐ పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తుందని సీపీఐ మండల కార్యదర్శి ముయేదా పాపారావు అన్నారు. శుక్రవారం నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో కాల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో సస్యరక్షణ కీలకం

రేగిడి, మార్చి 7,(ఆంధ్రజ్యోతి): జీడి, మామిడి, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన సాగులో రైతులు సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని కురపాం కృషివిజ్ఞాన కేంద్రం సైంటిస్టు ఎస్.శ్రీనివాస్‌రాజ్ సూచించారు. మండలంలో సంకిలి సచివాలయ పరిధి రైతులకు శుక్రవారం సస్యరక్షణ చర్యలపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణలో రాజాం డివిజన్ హార్టికల్చర్ అధికారి సీహెచ్.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

చీకట్లోనే రాకపోకలు

● బీపీ కాలనీ రోడ్డులో వెలగని దీపాలు



కాలనీ రహదారిలో అంధకారం

గరివిడి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీపీ(బద్దే ప్రసాద్) కాలనీకి వెళ్లే రహదారిలో విద్యుత్ దీపాలు వెలగడంలేదు. విజయనగరం, చీపురుపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఆ కాలనీ ఉంది. ఇక్కడ దాదాపు 600 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాకపోకలకు వారు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ పాలకుల తీరుపై వారు అసంతృప్తి చెందుతున్నారు. ఇప్పటికైనా కాలనీ రోడ్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు.

విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు

● ఆందోళన చెందుతున్న వినియోగదారులు



భోగాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

భోగాపురం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల కేంద్రంలో విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్తు ఉపకరణాలు పాడవుతాయని ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో వారు ఇక్కట్లకు గురవుతున్నారు. హైవోల్టేజీ రావడం అంతలోనే సాధారణ వోల్టేజీగా మారడం.. అంతలోనే లోవోల్టేజీ రావడం క్షణాల్లోనే జరుగుతోంది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే కొన్ని ఉపకరణాలు మరమ్మతుకు గురైనట్టు పలువురు తెలిపారు. ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు ఆన్ చేయడానికి భయపడే పరిస్థితి నెలకొంది. విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల విషయమై సంబంధిత సిబ్బందికి ఫిర్యాదులు చేసినా కనీసం స్పందించడం లేదని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై విద్యుత్తు ఏఈ మస్తాన్‌వలీ వివరణ కోరగా విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులపై ఫోన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

గృహోపకరణాలు ఉపయోగించడానికి భయమేస్తోంది...



విద్యుత్తు హెచ్చుతగ్గుల వల్ల గృహోపకరణాలు ఉపయోగించుకోవడానికి భయంగా ఉంది. దీనిపై ఫిర్యాదులు చేసినా స్పందించడంలేదు. ఫ్యాన్లు, ఏసీ వేయకుండా ఉండలేకపోతున్నాం. వేస్తే అవి కాలిపోతాయని భయపడుతున్నాం.

-అడపా అనంతకుమార్, భోగాపురం

ధర లేదు.. కొనేవారు లేరు

(5వ పేజీ తరువాయి)

ఆదివాసీలు ఆదేశించారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. ప్రస్తుతం వాటికి గిరాకీ లేకపోగా.. కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గ్రామాల్లో తిరిగి గిరిజనులు విక్రయిస్తే ఒక చీపురు కట్టకు రూ.40-50 మాత్రమే వస్తుంది. కొండపై ఉన్న పంటను కోసి దిగువున ఉన్న గ్రామాలకు తెచ్చి.. చీపుర్లుగా కట్టలు కట్టేందుకు అయ్యే కూలీల ఖర్చులు కూడా రావడం లేదని ఆ ప్రాంతవాసులు పోతున్నారు

●అటవీ ఉత్పత్తుల కొనుగోలు చేస్తామన్న ఐటీడీఏ, జీసీసీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. కనీసం మహిళా సంఘాల ద్వారా కూడా వాటిని కొనుగోలు చేయడం లేదు. ప్రస్తుతం గిరిపుత్రులు ఇళ్ల బయట కొండచీపుర్లను ఉంచలేక అమ్ముకోలేక తలలు పట్టుకుంటున్నారు. ఈ సీజన్‌లో ఒక్క వర్షం పడితే చీపుర్లన్నీ పాడయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

ఎలా విక్రయించాలో..

ఈ ఏడాది కొండ చీపుర్లకు గిరాకీ లేదు. కనీసం కొనేవారే లేరు. జీసీసీ తో పాటు వ్యాపారులు, దళారులెవరూ కొనుగోలు ముందుకు రావడం లేదు. దీంతో వాటిని ఎలా విక్రయించాలో అర్థం కావడం లేదు. ప్రస్తుతం ఇంటి బయటే చీపుర్లను ఉంచాల్సి వస్తోంది.

- పత్తిక గయమ, మూలగూడ

అధికారులు స్పందించాలి..

ఈ ప్రాంతంలో కొండ చీపుర్లకు డిమాండ్ ఎక్కువ. ఏటా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం కొండ మీద నుంచి చీపుర్లను ఇంటికి తీసుకొచ్చి కట్టలు కట్టేశాం. అయితే ఇంత వరకు జీసీసీ, మహిళా సంఘాలు కొనుగోలు చేయలేదు. వాటిని ఎంతకాలం భద్రపరచాలో అర్థం కావడం లేదు. వర్షం కురిస్తే చీపుర్లు తడిసిపోతాయి. అధికారులు స్పందించి వాటి కొనుగోలుకు చొరవ తీసుకోవాలి.

- బిడ్డిక నరసమ్మ, మూలగూడ

అనుమతులు ఇవ్వలేదు

గతంలో జీసీసీ ద్వారా కొండ చీపుర్లు కొనుగోలు చేసేవాళ్లం. అయితే ఈ ఏడాది ఇంకా అనుమతి రాలేదు. ప్రస్తుతం గిరిజనుల నుంచి ఉసిరి, కరక్కాయ, జీడిపిక్కలు తదితర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాం. చీపుర్ల విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- పి.విశ్వనాథం, జీసీసీ సేల్స్‌మన్, భామిని

మిర్తివలసలో అగ్నిప్రమాదం

● 1,839 టేకు, జీడిమామిడి చెట్లు దగ్ధం ● రూ.20లక్షల నష్టం

బలిజిపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్తివలసలో శుక్రవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో 15మంది రైతులకు చెందిన 1,839 టేకు, జీడిమామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామ సమీపంలో ఉన్న తోటల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో శాలీల శ్రీరాములు, పోలిరాజు, జి.అప్పయ్యతోపాటు 15మందికి చెందిన తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. 1500 టేకు చెట్లు, 161 జీడిమామిడి, 178 మామిడి చెట్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. పంట నష్టపోయిన రైతులు లబోదిబోమంటున్నారు. విషయం తెలుసుకున్న వీఆర్వో పెంకి వేణు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు రూ.20 లక్షల నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

మహిళలపై అకృత్యాలను అరికట్టాలి



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బెలగాం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై అకృత్యాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు నిరోధానికి సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సుందరయ్య భవనం వరకు ఐద్వా, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుందరయ్య భవనంలోని సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమాజంలో మహిళలు పనిచేసే చోట రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వి.ఇందిరా, జి.జ్యోతి, లక్ష్మి, వరహాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలను గుర్తించాలి

గరుగుబిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్‌కు రైతుల అవసరాలను గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు సూచించారు. శుక్రవారం తోటపల్లి జట్టు నూతన కార్యాలయంలో సీతంపేట, భామిని, కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు చెందిన 100 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలు పూర్తిస్థాయిలో అవలంభించేందుకు మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహించామని చెప్పారు. విత్తనాలను శుద్ధి చేసుకుని పంట పొలాల్లో వేస్తే వర్షం పడిన తరుణంలో మొలకలు వస్తాయన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో విత్తన గుళికలు తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి కోసం ముమ్మర గాలింపు

గరుగుబిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు యంత్రాంగం ముమ్మర గాలింపు చర్యలు చేపడుతోంది. ఈ మేరకు శుక్రవారం ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి, గొల్లవానివలస, బీవీ పురం, గరుగుబిల్లితో పాటు పలు ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో గాలింపు నిర్వహించారు. ఎస్ఐ జి.రమేష్ నాయుడు, సీసీఎస్ ఎస్ఐ తిరుపతిరావు, దేముడుబాబు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సర్వే వేగవంతం చేయాలి

మక్కువ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాం ధ్ర ఫేజ్-4 సర్వే వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.తిరుపతయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సచివాలయం ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 8వ తేదీ నుంచి 13వ తేదీలోపు స్వర్ణాంధ్ర సర్వే శతశాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో స్వరూపారాణి పాల్గొన్నారు.

కర్రల లారీ బోల్తా

ఒడిశా



కొరాపుట్ కూడలి వద్ద బోల్తా పడిన లారీ

రాయగడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరాపుట్ కూడలి వద్ద శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ నుంచి జేకే కాగిత పరిశ్రమకు కర్రల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు సిబ్బంది గాయాల పాలయ్యారు. ఘటానా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను జిల్లా కేంద్రాసుపత్రిలో చేర్చారు. ఈ ఘటనలో రైల్వే కాలనీ కాంపౌడ్ వాల్ కూలిపోయింది. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరుణించమ్మా.. ఎల్లమ్మ

● వాడవాడలా సిర్లిపోతన్న మహోత్సవాలు

● ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

● జాతరలకు పోటెత్తిన భక్తులు

సిర్లిపోతన్న, ఎల్లమ్మతల్లి జాతర మహోత్సవాలు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మతల్లి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంట్యాడలో ఎల్లమాంబ సిరిమానోత్సవం, బుడతనాపల్లిలోని ఎల్లమాంబ తీర్థ మహోత్సవం ఘనంగా చేపట్టారు. పార్వతీపురం, వీరఘట్టం, భామిని, పాలకొండ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన జాతరలకు భక్తులు పోటెత్తారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



రాజాం: ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు



గంట్యాడ ఎల్లమాంబ సిరిమానోత్సవం



భామిని: సిర్లి ఎల్లమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న దృశ్యం



వీరఘట్టం: మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పాలకొండ: సిర్లిపోతన్నకు పూజలు చేస్తున్న దృశ్యం



పార్వతీపురంటౌన్: సిర్లిపోతన్న ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



బొబ్బిలి: ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు

బెలగాం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేసిన వాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆదివాసీ జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గిరిజన జాబితాలో ఉన్న ఆదివాసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. బోయ వాల్మీకులను ఎస్టీలలో చేర్చ వద్దని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు డి.సీతారాం, ఆరిక చంద్రశేఖర్, రామకృష్ణ, కోలక గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పార్వతీపురంటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 200 ఏళ్ల కిందట నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖ ఆలయాల అసిస్టెంట్ కమిషనర్ రాజారావు పర్యవేక్షణలో విగ్రహ దాతలు ఆల్లి శ్రీనివాసరావు, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మజ్జి నాగమణి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

15న వినియోగదారుల సదస్సు

గరుగుబిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన గరుగుబిల్లి మండల కేంద్రంలో వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్టు ఫోరం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో తిరుపతినాయుడుతో పాటు పలువురు అధికారులు ఆహ్వాన పత్రికలను అందించారు. ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఎంఈవో అప్పలనాయుడు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు

పార్వతీపురంటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం తోటపల్లిలో ప్రధాన పంప్‌హౌస్ వద్ద తాగునీటి సరఫరాపై ఇంజనీరింగ్ విభాగం డీఈ శ్రీనివాసరాజు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని 30 వార్డుల ప్రజలకు తాగునీటి సరఫరా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ ఏడాది వేసవిలో తోటపల్లి వద్ద నాగావళి నదిజలాల ప్రవాహం తగ్గే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

వేసవి కాలంలో తాగునీటి సరఫరాతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వేంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశామని చెప్పారు. 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజారోగ్య శాఖాధికారులతో పాటు సచివాలయ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.

అసెంబ్లీ దృష్టికి పార్వతీపురం సమస్యలు

● ప్రస్తావించిన ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజవకర్గంలో నివాసయోగ్యం కాని స్థలాన్ని గతంలో రూ.40లక్షలకు కొనుగోలు చేసినట్టు ప్రభుత్వానికి చూపించి, సంబంధిత దళితులు, గిరిజనులకు కనీసం రూ.లక్ష కూడా ఇవ్వలేదని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల వారు నివాసం ఉంటున్న స్థలాల వద్ద ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన పత్రాలు జారీ చేయడంలో రెవెన్యూ అధికారులకు, గృహ నిర్మాణ శాఖ అధికారులకు మధ్య సమన్వయం లోపించిందని, దీనిని పరిష్కరించాలని అసెంబ్లీలో ఆయన కోరారు. పార్వతీపురం పట్టణానికి ఒక ప్రైవేటు వైద్య కళాశాల మంజూరైందని, ఇది ఫేస్ త్రీలో ఉందని, ఫేస్-2లో తీసుకొని వస్తే పార్వతీపురం ప్రాంత ప్రజలతో పాటు ఒడిశా వాసులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బలిజిపేట మండలంలో నారంనాయుడు వలస పంచాయతీ పరిధిలోని శ్రీరంగ రాజుపురంలో ఎంతో మంది కిడ్నీ వ్యాధితో చనిపోతున్నారని అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల స్థాయి నుంచి ఒలింపిక్ పోటీలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా స్పోర్ట్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇలా నియోజకవర్గానికి సంబంధించి వివిధ సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మక్కువ చేరుకున్న దేవతామూర్తుల విగ్రహాలు

మక్కువ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి, మరకతలింగ శివాలయాల్లో ప్రతిష్టాపనకు కావాల్సిన దేవతామూర్తుల విగ్రహాలు మహాబలేశ్వరం నుంచి మండల కేంద్రానికి శుక్రవారం చేరుకున్నాయి. దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ మజ్జి గౌరమ్మ ఆలయం నుంచి నిర్మాణంలో ఉన్న ఆలయాల ప్రాంగణం వరకు ఊరేగించారు. విగ్రహాలను ప్రతిష్ఠించేవరకు ధాన్యాదివాసంలో ఉంచారు. ధాన్యాన్ని తీసుకొచ్చిన భక్తులకు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, టీడీపీ నాయకులు మావుడి ప్రసాదరావు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నఖచిత్రం

గరుగుబిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు స్త్రీ చిత్రాన్ని గీశారు. గోటితో దళసరి పేపర్‌పై తీర్చిదిద్దిన ఈ స్త్రీ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.



గోటితో గీసిన చిత్రం

మృత్యుంజయస్వామికి మోదుగపూలతో అలంకరణ

పాలకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేటలో గల షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో ఉన్న మృత్యుంజయ స్వామికి శుక్రవారం మోదుగపూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సర్వేలు పూర్తి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కురుపాం, మార్చి7(ఆంధ్రజ్యోతి): కురుపాం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఎం.రమణమ్మను పీజీఆర్ఎస్, పీఓఎల్ఆర్, ఎంఎస్ఎంఈ సర్వే, మ్యుటేషన్ల పరిష్కారం, పీ4 సర్వే నిర్వహణ తీరు అంశాలపై, రెవెన్యూ సేవలపై అడిగి తెలుసుకున్నారు. సర్వేలు అన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మోనటరింగ్ సిస్టం ద్వారా బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈనెల 10 నుంచి బీసీ గ్రూపులో ఉన్న వారందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రుణాలకు సంబంధించిన అవగాహనా సమావేశాలు నెల రోజులు నిర్వహిస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస గ్రామంలో ఎస్.సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొని, మాట్లాడారు. ఆదివాసీ మహిళలు విద్యతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గౌరవ అతిథిగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డా.మంచుపల్లి శ్రీరాములు పాల్గొన్నారు. ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, భద్రగిరి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు స్రవంతి, ఉమాజ్యోతి, దుడ్డుకల్లు సర్పంచ్ నీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళా సంఘాలు పీవోకు మెమొంటో అందించారు. ● బొబ్బిలి: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కౌన్సిలర్ కళ్యంపూడి లక్ష్మీ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక సింహాలతోట లో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. పలువురు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: పీవోకు మెమోంటో అందజేస్తున్న మహిళలు



బొబ్బిలి: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి



బొబ్బిలి రూరల్: వైద్య శిబిరంలో డీఎస్పీ భవ్యరెడ్డి

ఎరకందొరవలసలో వైద్య శిబిరం

బొబ్బిలి రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిలి పోలీసు శాఖ సౌజన్యంతో శుక్రవారం ఎరకందొరవలసలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ జి.భవ్యరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 13 గిరిజన గ్రామాల రోగులు వైద్య సహాయం పొందారు. భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. సీఐ కె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పీ4 సర్వేకి సన్నద్ధం కావాలి

సీతానగరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి సచివాలయ ఉద్యోగులంతా సన్నద్ధం కావాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సహాయ గణాంకాధికారి సతీష్ అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులకు రెండు విడతల్లో పీ4 సర్వే పనులపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల లెక్కల ప్రకారం 19,526 కుటుంబాలు ఉన్నాయని, 17,500 కుటుంబాలు నమోదయ్యాయని తెలిపారు. ఇంతవరకు సర్వే సరిచేస్తూ మిగిలిన కుటుంబాల వివరాలపై సర్వే చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎంఎల్ఎన్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

పేదరిక నిర్మూలన కోసం

గరుగుబిల్లి: గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం తలపెట్టిన పీ4 సర్వేను సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాల యాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి సర్వే ప్రారంభించి 15వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. జీవన ప్రమాణాల్లో 20 శాతం మేర నిరుపేదలను గుర్తించామన్నారు. ఎంపీడీవో జి.పైడితల్లి, మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, పరిపాలనాధికారి ఎన్.అర్జునరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

జియ్యమ్మవలస: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేసుకుని నిర్వహిస్తున్న పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శంబంగి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన సమాజ నిర్మాణమే పీ4 సర్వే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సత్యప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ● భామిని: పీ-4 సర్వే ద్వారా పేదల గుర్తింపు సులభతరం అవుతుందని ఎంపీడీవో కె.సత్యం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీ-4 సర్వేపై జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి శిక్షణ అందించారు. ఈవోఆర్‌డి కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేపై శిక్షణ

బొబ్బిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో పీ4 సర్వేపై శిక్షణ ఇచ్చారు. టీపీఆర్‌వో జగన్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలందరికీ వర్తింపజేసేందుకు దోహదపడే ఈ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. 8, 9 తేదీలలో పన్నుల వసూలు కౌంటర్లు పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజరు రాఘవాచార్యులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.